క్లుప్తంగా

7న మండల సర్వసభ్య సమావేశం

పుల్లంపేట : ఈనెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలాధికారులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ కోరారు.

సంతకాల సేకరణ



మహిళల వద్ద నుంచి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

నందలూరు(ఒంటిమిట్ట) : మండల పరిధిలోని అరవపల్లి ప్లే గ్రౌండ్‌లో ఐకేపీఎస్ వారి ఆధ్వర్యంలో నందలూరు రైల్వే స్టేషన్ వద్ద వెంకటాద్రి, ముంబై ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు శుక్రవారం మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తోటపాలెంకు చెందిన మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సంపూర్ణ మద్దతు తెలిపారు. మండలంలో పలు చోట్ల ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పల్లె గ్రీష్మంత్ రెడ్డి, అభిషేక్, ముమ్మడిశెట్టి సుధాకర్, పుత్తా శంకర్, శాంత కుమార్, పెంచలయ్య, సాయి, రాము, ఫరీద్, శివసేన తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమావేశం నేడు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహంలో శనివారం ఉపాధి హామీ పనులు, పెన్షన్లపై ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతులు, ఉపాధి కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ అనుసంధాన శాఖల సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తప్పకుండా బహిరంగ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పుల్లంపేట : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పుల్లంపేట ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. ఎవరైనా వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి అంగవైకల్యం పొందడంతోపాటు నిండు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

అమ్మవారికి రాహుకాల పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో వెలసిన భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు, భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగురంగుల పూలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించారు. తరువాత అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. నిమ్మకాయలపై వత్తులు వెలిగించి అమ్మవారికి మహిళలు హారతులు పట్టారు.

హైంధవ ధర్మాన్ని రక్షించుకోవాలి



పీఠాధిపతిని సన్మానిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు, పాలక మండలి సభ్యులు

హైందవ ధర్మం చాలా గొప్పదని దీనిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నైమిశారణ్యం పీఠాధిపతులు హిందూ ధార్మిక్సేవా సమితి అధ్యక్షులు బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి అన్నారు. శుక్రవారం వీరభద్ర స్వామి ఆలయంలో ప్రవచనలు చేశారు. స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని ఆలయ పాలకమండలి అధ్యక్షులు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఘనంగా సన్మానించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, నాగభూషణం, సురేష్,తదితులు పాల్గొన్నారు.

మాది పించన్ల సంఖ్యను పెంచే ప్రభుత్వం

- సర్కార్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు
- గడప గడపకు మన ప్రభుత్వంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా



పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి తదితరులు

సుండుపల్లె (వీరబల్లి) : అర్హులైన ప్రతి పేదవారికి నవరత్నాలు ఇవ్వాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సుండుపల్లె మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి పంచాయతీలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందజేసేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలు పథకాల లబ్ధి పొందేలా వలంటీర్ల ద్వారా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో వలంటీర్ వ్యవస్థను పర్మనెంట్ చేసి వారికి వేతనాలు పెంచే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. కొందరు టీడీపీ నాయకులు గ్రామాలలో పథకాలు గురించి తప్పుదోవపట్టిస్తున్నారని, అటువంటి వారికి లబ్ధిదారులు గుణపాఠం చెప్పాలన్నారు. పింఛన్ల వెరిఫికేషన్ ఉన్నప్పుడు పింఛన్లను తీసేశారని టీడీపీ ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. మాది పింఛన్ల సంఖ్యను పెంచే ప్రభుత్వమని ఆయన తెలియజేశారు. అసత్య ప్రచారాలు చేసేవారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్షం ఎల్లో పత్రికలు, పచ్చ మీడియా సాయంతో నీచమైన రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. పలు గ్రామాలలో ఎమ్మెల్యేకి మహిళలు, నాయకులు పూలమాలలతో స్వాగతించారు. అక్కడక్కడ గ్రామాలలో కొందరు తమకు రోడ్లు, తాగునీరు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సచివాలయ సిబ్బందికి, సంబంధిత అధికారులకు తెలిపి సమస్యలను పరిష్కరించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పూడిపోయిన పింఛా కాలువ పనులు ప్రారంభం

సుండుపల్లె (వీరబల్లి) : పింఛా ప్రాజెక్టు నుండి పూడిపోయిన కాలువలను తీయించి రెండు గ్రామాలకు నీటి సౌకర్యం కోసం రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున రెడ్డి శుక్రవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. అలాగే సుండుపల్లె మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన ముచ్చటించి పనులను బాగా చేస్తున్నారని ఉపాధి కూలీలను మెచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు నాగిరెడ్డిపల్లెలో..

ఒంటిమిట్ట(నందలూరు) : మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లె-2 గ్రామ పంచాయతీలో నేడు(శనివారం) ఉదయం 8:30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దోమ పుట్టకూడదు.. కుట్టకూడదు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎంఓ

సంబేపల్లె : గ్రామాల్లో దోమ పుట్టకూడదు, దోమ కుట్టకూడదని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్యాల పంచాయతీలోని పరసరాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ మురికినీరు నిల్వ వుండకుండా చూడాలన్నారు. గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో సంబేపల్లె మండల వైద్య సిబ్బందితో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఆశ కార్యకర్తలు ప్రతి శుక్రవారం ఇంటింటికి వెళ్లి దోమలు నిల్వ వుండే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయించాలన్నారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, దోమకాటు వలన వచ్చే వ్యాధులపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల దాడులు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారులు అకస్మిక దాడులు చేశారు. శుక్రవారం సాయంత్రం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి విజిలెన్స్ అధికారి అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు టి. రెడ్డెప్ప, కెవి కిశోర్, ఏఈఈ ఎస్ఎం ఇనాయతుల్లా, టి సునితలు తనిఖీలు నిర్వహించారు. వీరి తనిఖీల నిర్వహణలో జాఫర్ సాహెబ్ అండ్ సన్స్, శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ వారి షాపులలో తనిఖీలు నిర్వహించారు. జాఫర్ సాహెబ్ అండ్ సన్స్ షాపులో యూరియా బస్తా రూ.266.50పైసలు ఉండగా రూ.300లు అమ్ముతన్నాడని తెలిపారు. దీంతో షాపులో ఉన్న 1413 బస్తాల యూరియాను సీజ్ చేసినట్లు తెలిపారు. తదుపరి దేశాల వరకు అమ్మకుండా సీజ్ చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి దివాకర్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. వీరిపై 6 (ఏ) యాక్టు1955 మేరకు కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్‌కు పంపుతున్నట్లు వివరించారు. ఉన్న ధరల కన్నా ఎక్కువ ధరలకు ఎరువులు ఎవరు అమ్మినా సహించేదిలేదని అలా కాకుండా చట్టవిరుద్ధంగా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సౌకర్యాలను వినియోగించుకుంటే భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హర్షలతా పంకజ్

రాయచోటి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలతా పంకజ్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత పంకజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అందించే నూతన విద్యావిధానం ప్రకారం అన్ని సౌకర్యాలు రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తుకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మునియా నాయక్ మాట్లాడుతూ సైన్స్ గ్రూపులలో ల్యాబ్ సౌకర్యాలు నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను వివరించారు. ఆర్ట్స్ విభాగంలో విద్యార్థులు యూనివర్సిటీ పరిధిలో ఫలితాలలో మంచి గ్రేడ్లు సాధించిన శుభపరిణామమని అధ్యాపకులు గుర్రప్ప అన్నారు. రానున్న పరీక్షలోనూ మంచి మార్కులు సాధించాలని డాక్టర్ ఫరూక్ అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మాట్లాడారు. చివరగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

మహిళా డిగ్రీ కళాశాలలోనూ..

రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోనూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వంచారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ హైదర్ అలీ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు ఏకపాత్రాభినయం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సభికులను ఆకట్టుకున్నారు.

మామిడి రైతులకు సస్యరక్షణపై శిక్షణ



రైతుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

సిద్దవటం : మండలంలోని టక్కోలి, వంతాటిపల్లె, ఎస్. రాజంపేట, జ్యోతి , పొన్నవోలు గ్రామాలకు చెందిన మామిడి రైతులకు ఉద్యాన శాఖ ద్వారా మామిడిలో సస్యరక్షణ చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం టక్కోలి, వంతాటిపల్లె రైతు భరోసా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో పూత, పిందె దశల్లో ఆశించే వివిధ రకాల చీడ పీడలు, తెగుళ్ల గురించి వాటి నివారణ చర్యల గురించి మామిడి రైతులకు వివరించామన్నారు. మామిడిలో మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి నాణ్యమైన దిగుబడి పొందవచ్చునని తెలిపారు. మామిడిలో పూమొగ్గ దశ నుంచి గోళీకాయ దశ వరకు రైతులు నెలవారీగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఏపీఎంఐపీ ఏపీడీ మురళీమోహన్, ఉద్యాన అధికారి జయభారత్‌రెడ్డి డ్రిప్‌పైన అవగాహన, ఉద్యాన శాఖ ద్వారా అమలు పరిచే పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. రమేష్ రెడ్డి, ఉద్యాన శాఖ సహాయకులు శ్రీనాథ్, వ్యవసాయ సహాయకులు ప్రేమ్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గాలివీడు : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే శుక్రవారం హెచ్‌ఈఓ సత్యనారాయణ, డీపీఎంఓ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారులు మాట్లాడుతూ కుష్టువ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చర్మం ఉబ్బెత్తుగా ఉండటం, కనురెప్పలు మూతపడకపోవడం, చల్లనివి లేదా వేడి వాటిని గుర్తించలేకపోవడం, కనుబొమ్మలు, రెప్పల వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలు ఉంటే తప్పనిసరిగా వైద్యాధికారులను సంప్రదించి సలహాలు పాటించాలని సూచించారు. సకాలంలో వ్యాధికి చికిత్స అందకపోతే అంగవైకల్యానికి దారితీస్తుందన్నారు. కుష్టువ్యాధికి అన్ని ప్రభుత్వ పాఠశాలలో చికిత్స ఉచితంగా లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ సత్యనారాయణ, డీపీఎంఓ కృష్ణారెడ్డి, హెడ్ మిసెస్ నిర్మల, సీహెచ్‌ఓ సుబ్బలక్ష్మి దేవి, పీహెచ్ఎన్ షమీమ్ తార, హెల్త్ సూపర్‌వైజర్ కె.మహేశ్వరరెడ్డి, ఏఎన్ఎం జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత నిధులతో చెక్‌పోస్ట్ భవన నిర్మాణం



భవన నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం : సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో మండలంలోని భాకరాపేట మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో ఇక్కడ ఒక బంకును ఏర్పాటు చేసుకొని అందులో సిబ్బంది విధులను నిర్వహించేవారు. బంకు పూర్తిగా దెబ్బతినడంతో వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో శాశ్వత భవనం ఏర్పాటు చేసేందుకు శుక్రవారం పనులు చేపట్టారు. ఈ మేరకు ఆయా పనులను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వి.సుబ్బయ్య, సెక్రటరీ సుజాతలు పరిశీలించారు.

పేదలకు జగనన్న ప్రభుత్వం కొండంత అండ

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు కొండంత అండగా నిలుస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిగుంట 2 సచివాలయం పరిధిలోని లక్ష్మీగారిపల్లె, అబ్బినాయుడుపల్లె, అరుంధతివాడ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటా సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమానికి మారుపేరుగా నిలిచిన ముఖ్యమంత్రి జగనన్న వెంటే ఉంటామని యువకులు సంతోషంగా ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, సామాజిక అంశాల్లో కుటుంబాలు అభివృద్ధి చెందేందుకు పలు రకాల పథకాలను అందిస్తున్నారని గ్రామస్తులు పేర్కొనడం విశేషం. మళ్ళీ మళ్ళీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలంటూ వారు దీవించారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా..

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకే పరిమితమైన సంక్షేమ పథకాలు నేడు కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు అందుతున్నాయని వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ నాగార్జున, అంబటి మురళీ, మనోహర్, బత్యాల నందగోపాల్, షఫీ, నారాయణరెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, పత్తి నరసింహులు, మహేష్, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, హరిక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు గాదెల సచివాలయ పరిధిలో..

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల సచివాలయ పరిధిలో నేడు శనివారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొనున్నారని నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉప సర్పంచ్‌గా సుదర్శన్‌రెడ్డి



నియామకపత్రాన్ని అందిస్తున్న సర్పంచ్

సంబేపల్లె : మండల పరిధిలో నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ఉప సర్పంచ్‌గా పి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు స్పెషల్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయరెడ్డిగారిపల్లె సచివాలయంలో పంచాయతీలోని వార్డు మెంబర్లు కలిసి 8వ వార్డు మెంబర్ పి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంతర పంటలతో లాభాలు

పెనగలూరు : అంతర పంటలతో అధిక లాభాలు వస్తుండటంతో రైతులు అంతర పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి తోటలో కలింగర, అరటి రెండు పంటలను ఒకేసారి సాగు చేశారు. మల్చింగ్ పద్ధతిలో అంతర పంటలు సాగు చేయడం వలన ఖర్చుతగ్గి ఆదాయం ఉంటుందని రైతు అంటున్నాడు. కలింగర పంట కోత కోసిన వెంటనే అరటిపంటను సాగు చేసుకోవచ్చన్నారు. దీంతోపాటు మామిడి తోటలు యథావిధిగా పెంచుకుంటూ అంతర్ పంటలలో వచ్చిన లాభాలతో మామిడి పంటలను సాగు చేసుకోవచ్చని వారు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

రాయచోటి అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో తీరని ద్రోహం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న అన్నారు. బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రానికి జరిగిన తీరని కేటాయింపును నిరసిస్తూ పట్టణంలోని మాసాపేటలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. బడ్జెట్‌లో ఎక్కడ విభజన హామీల ప్రస్తావన, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన ఊసేలేదని అంకన్న అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి జోగేశ్వర్, రాయచోటి నేతలు గణేష్, జయపాల్ రెడ్డి, అంజి, ఇమ్రాన్, ఓబులరెడ్డి, రమణ, సురేష్, జబీవుల్లా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం కార్యకర్తలు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. రైల్వేప్రాజెక్టుల ఊసెత్తడం లేదని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన లేదని మండిపడ్డారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు చేయకపోగా నిర్వాసితులకు పునరావాసం కల్పించడం పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగబసిరెడ్డి, ఎస్.రామచంద్ర, డి.సి.వెంకటయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘం ఎన్నిక



హాజరైన వీఆర్‌ఏలు

సంబేపల్లె : గ్రామసేవకుల సంఘం ఎన్నిక శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా ఉన్న గ్రామ వీఆర్‌ఏలు కలిసి మండలంలోని గుట్టపల్లె వీఆర్‌ఏ రెడ్డెయ్యను మండలాధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డిపల్లె వీఆర్‌ఏ అచ్చమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ గ్రామ సేవకుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామన్నారు.

మార్చిలోపు వంద రోజులు పూర్తి చేయండి

రామాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు మార్చి చివరిలోపు 100 రోజులు పని దినాలు పూర్తి చేయాలని ఏపీడీ రెడ్డప్ప నాయుడు అన్నారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె, బండపల్లె, సుద్దమళ్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఉపాధి పనులు రోజుకు నాలుగు గంటలపాటు చేయాలని, పనులు చేసే ముందు పని పూర్తయిన తరువాత తప్పనిసరిగా ఫోటోలు తీసుకోవాలని, లేని పక్షంలో కూలీ డబ్బులు రావన్నారు. రోజు కూలీ రూ257లు వచ్చే విధంగా పనులు చేయాలని కూలీలకు సూచించారు. కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలో ఫీడర్ ఛానల్, సుద్దమళ్లలో పశువుల తొట్లు బండపల్లెలో గ్రామంలో చెక్‌డ్యాంలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో 2వేల మంది కూలీలు పని చేస్తున్నారని, కూలీల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి, ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, టీఏలు బాబు, నాగేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరును రద్దు చేయాలి

ధర్నాలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాయచోటి అర్బన్ : కార్మికులను తీవ్ర ఒత్తిళ్ళకు గురిచేస్తున్న ముఖ ఆధారిత హాజరు పద్ధతిని వెంటనే రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ ఆధారిత హాజరు పద్ధతిని రద్దుచేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెకాలంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కార్మిక సంఘాలతో జాయింట్ కమిటీ సమావేశంను వెంటనే నిర్వహించాలంటూ కోరారు. కార్మికులు ఎక్కువ మంది నిరక్ష్యరాసులు, తక్కువ చదువుకున్న వారైనందున వారికి స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం తెలియదన్నారు. హాజరుపడితేనే జీతం వస్తుందని చెబుతున్న తరుణంలో కార్మికులు ముఖ ఆధారిత హాజరు నమోదులో ఏ చిన్న పొరపాటు జరిగినా కార్మికులు తీవ్రంగా నష్టపోతారంటూ చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, నేతలు బి.వి.రమణ, వెంకటేష్, వెంకటలక్ష్మి, సరోజ, సుజాత, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.